వైభవంగా సువర్ణ పుష్పార్చన

స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, జూన్19: యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో బుధవారం సువర్ణ పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. ఆర్జిత పూజల్లో భాగంగా ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ మూర్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన పూజలు చేశారు. బంగారు పుష్పాలతో దేవేరులను అర్చించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూపంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగాయి. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని 12 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖాజానకు రూ. 25,03,371 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గిరి ప్రదక్షిణల రోడ్డు సుందరీకరణ

గిరి ప్రదక్షిణల రోడ్డును ఆలయ అధికారులు సుందరీకరించారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున ప్రదక్షిణలు చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పరిసరాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జడ్పీ వైస్‌చైర్మన్ బీకూనాయక్

స్థాయీసంఘం సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్ బీకూనాయక్

భువనగిరి కలెక్టరేట్, జూన్19 : అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాల మేరకు అభివృద్ధి పనులను చేపట్టాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ధనావత్ బీకూనాయక్ సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జడ్పీ మూడవ స్థాయి సంఘం(వ్యవసాయం) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వారికి నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులపై వివరించారు. అంతకు ముందు ఐదవ స్థాయి సంఘం(మహిళా సంక్షేమం) సమావేశం గోళి ప్రణీతా పింగల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశాల్లో జడ్పీటీసీ సభ్యులు సుబ్బూరు బీరుమల్లయ్య, జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. శోభారాణి, డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

10వ వార్డులో డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

దశలవారీగా భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూన్ 19 : పట్టణంలోని అన్ని వార్డులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.కోటి, జనరల్ ఫండ్ రూ.2 లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, పట్టణ ప్రగతి నిధులతో రూ.5 లక్షలతో పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు, బహార్‌పేట్‌లో జనరల్‌ఫండ్ నిధులు రూ.2 లక్షలతో డ్రైనేజీ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొత్నక్ ప్రమోద్‌కుమార్, ఈరపాక నర్సింహ, నాయకులు, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

బీబీనగర్ : మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన తెల్జూరి ఐలయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పంజాగుట్ట నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. అతడి చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.5 లక్షల ఎల్ఓసీని బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఐలయ్య కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు రక్తని కృష్ణ, అంబటి చంద్రయ్య, సిద్దగోని శ్రీకాంత్‌గౌడ్, బుయ్య సంతోష్ పాల్గొన్నారు.

పని చేయడం ఇష్టం లేకుంటే బదిలీకి సహకరిస్తా

- అధికారులపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఫైర్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, జూన్19 : అధికారులకు ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకుంటే చెప్పాలని, బదిలీకి సహకరిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం యాదగిరి గుట్ట మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీర శ్రీశైలం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో 25 అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేస్తే ఇప్పటి వరకు ఒక్క భవన నిర్మాణం కూడా ప్రారంభం కాలేదన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు సుమారు రూ.2.20 కోట్లు మంజూరు చేశామని, ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తికాలేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు అలసత్వం వీడాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన మేరకు ఆగస్టు 15లోపు రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ మూడు విడుతలుగా ఉంటుందన్నారు. ధరణిలో మార్పులు తీసుకొచ్చామని, ఇక నుంచి రైతులకు ఎలాంటి సమస్యలు రావన్నారు. డ్రగ్స్, మత్తు పానీయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ తోటకూరి అనురాధాబీరయ్య, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజాపేటను దత్తత తీసుకుంటా

రాజాపేట : మండలాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాలల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలేరు అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. అంతకు ముందు సమావేశంలో దూదివెంకటపురం సోమిరెడ్డికుంట భూమి ఆక్రమణ, ఇసుక, చెరువు మట్టి అక్రమ రవాణపై తాసీల్దార్ దామోదర్‌ను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, వైస్ ఎంపీపీ కాయితీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి బయటి వ్యక్తులు

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాగా ఆయన వెంట కొంత మంది నాయకులు కూడా వచ్చారు. అయితే బయటి వారు వెళ్లిపోవాలని అధికారుల సూచనలతో అందరూ వెళ్లిపోగా ఓ నాయకుడు మాత్రం వెళ్లలేదు. అధికారులు కూడా అతడి గురించి పట్టించుకోక పోవడంతో సమావేశం ముగిసే వరకు హాల్లోనే ఉన్నాడు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- మంత్రి తుమ్మలకు చేనేత కార్మికుల వినతి

మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మికులు

చౌటుప్పల్, జూన్ 19 : చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు చేనేత కార్మికులు వినతిపత్రం అందించారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో కలిసి విన్నవించారు. సంఘం ఖాతాలో నగదును జమచేయకుండా సంవత్సరాల తరబడి సొంతానికి వాడుకుంటున్నారని వారు ఆరోపించారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడిన వారికి సైతం వాటాలు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే సంఘం పాలక వర్గాన్ని రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గోశిక స్వామి, గోశిక భిక్షపతి, వనం ధనుంజయ్య, గుర్రం నర్సింహ, గోశిక రవి, కూరపాటి రమేశ్, గోశిక నర్సింహ ఉన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలకు రండి

- మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే సామేల్‌కు ఉత్సవ కమిటీ ఆహ్వానం

మోత్కూరు, జూన్ 19: మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం ఆహ్వాన పత్రికలు అందించారు. ఈ నెల 21 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కొప్పుల కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమ వెంకటేశ్వర్లు, గుండగోని రామచంద్రుగౌడ్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, మంగేశ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బయ్యని రాజు, వెంకట్‌రెడ్డి, నాగేశ్ పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

స్వర్ణగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 19 : పట్టణంలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మానేపల్లి మురళీకృష్ణ ఆయనను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సాధినేని మధుకర్, కుతాడి సురేశ్, వల్లాపు విజయ్, గాజుల నవీన్, దండబోయిన బాలరాజు, కవాడి నవీన్, శ్రీశైలం, నరేశ్, శేషు, మోతె మనోహర్ ఉన్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

మోత్కూరు, జూన్ 19: మున్సిపాలిటీ పరిధిలోని కాశవాడ కాలనీలో పాతకక్షల నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇరువురు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కాలనీకి చెందిన షేక్ జమాల్, షేక్ సైదులు మధ్య డబ్బులు, అక్రమంగా బండ కొట్టుడు విషయంలో వివాదం తలెత్తింది. దాంతో ఈ నెల 14న జమాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దానిని మనసులో పెట్టుకొని షేక్ సైదులుతో పాటు షేక్ రహీంబీ, మదార్, యాదుల్‌తో పాటు మరి కొందరు జమాల్, ఆయన భార్యపై దాడి చేశారు. దాంతో తనతో పాటు తన భార్యకు గాయాలైనట్లు జమాల్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తుంగతుర్తి అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే సామేల్ వినతి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధులు అందించాలని కోరుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూన్ 19: తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ సచివాలయంలో సీఎంను కలిసి ఈ మేరకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గుండ్లగూడెంలో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది

ఆలేరురూరల్, జూన్19 : మండలంలోని గుండ్లగూడెంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు బీపీ,షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రావుల రవీందర్‌రెడ్డి, జిల్లా వైస్‌చైర్మన్ దిడ్డి బాలాజీ, వైద్యురాలు జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి శశికాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

సీనియర్ ఎస్‌జీటీలకు న్యాయం చేయాలని వినతి

ఆలేరురూరల్ : అర్హత కలిగిన సీనియర్ ఎస్‌జీటీలకు సబ్జెక్టుల వారీగా క్రాస్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ బుధవారం ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందించారు. బదిలీల్లో మ్యాన్‌యువర్ పద్ధతిలో ఆఫ్‌లైన్‌లో జరిపించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో ఎస్‌జీటీలు బి. మధు, ఎండీ సయ్యద్, నాగరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీసీల ఎదుగుదల ఓర్వలేకే పార్టీ నుంచి బహిష్కరణ

- కాంగ్రెస్ బహిష్కృత నేత ఆదినారాయణ

భువనగిరి కలెక్టరేట్, జూన్ 19 : కాంగ్రెస్ పార్టీలో బీసీ నాయకుల ఎదుగుదలను ఓర్వలేకే ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయించారని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత వలందాసు ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయడం వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందని పేర్కొన్నారు. 30 ఏండ్లుగా రాజకీయాల్లో పార్టీ అభివృద్ధికి తాను ఎంతగానో కృషి చేశానని తెలిపారు. నియోజకవర్గంలో బీసీ నాయకులు ఎదుగకుండా ఉక్కుపాదం మోపుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడేది లేదని.. ఆయన బీసీలను అణగదొక్కేందుకు చేస్తున్న చర్యలకు వ్యతిరేకంగా పోరాడతానని స్పష్టం చేశారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలి

- చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ మాటూరి బాలరాజు

భువనగిరి అర్బన్, జూన్ 19: గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని చేతి వృత్తిదారుల జిల్లా కన్వీనర్ మాటూరి బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని వృత్తిదారుల భవన్‌లో బుధవారం నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీసేందుకు తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదాల బారినపడి పడి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు కల్లుగీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వాగ్దానం చేసిందన్నారు. తాటి చెట్ల పైనుంచి పడి మృతి చెందిన, గాయాల పాలైన కార్మికులకు రావాల్సిన ఎక్స్ గ్రేషియా, కార్పొరేషన్ నుంచి రావాల్సిన పరిహారం అందించాలని కోరారు. సమావేశంలో సంఘం మండలాధ్యక్షుడు పాండాల మైసయ్య, కార్యదర్శి మట్ట బాలరాజు, నాయకులు రంగా కొండల్, గడ్డమీది సోములు, కొండ అశోక్, మచ్చ భాస్కర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీడీఓ నిరంజన్‌వలీ

సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ నిరంజన్‌వలీ

ఆత్మకూరు(ఎం), జూన్19 : మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నిరంజన్‌వలీ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇంటింటి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబంలో ఎంతమంది ఉన్నారు, భగీరథ నీళ్లు ఎన్ని లీటర్లు వస్తున్నాయనే వివరాలను సేకరించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల సీజ్

ప్రైవేటు పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

వలిగొండ, జూన్19: మండల కేంద్రంలో శ్రీచైతన్య పేరుతో ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలను బుధవారం ఎంఈఓ శ్రీధర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు పాఠశాలను తనిఖీ చేశామని, పాఠశాల నిర్వాహణకు ప్రభుత్వ అనుమతులు లేక పోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని తల్లి దండ్రులకు ఆయన సూచించారు.

పుస్తకాలు నిల్వ ఉంచిన గదులు సీజ్

భువనగిరి అర్బన్, జూన్ 19: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తుండడంతో ఎంఈఓ ఆదేశాల మేరకు సీఆర్పీలు బుధవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని మదర్ థెరిస్సా, మాంటిస్సోరీ, కృష్ణవేణి పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో వాటిని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బొల్లెపల్లి వినయ్, పండాల శరత్, మసూద్, వరుణ్, కార్తీక్, అఫ్రోజ్, కౌశిక్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం ఎస్ఐ బదిలీ

బొమ్మలరామారం, జూన్19 : బొమ్మలరామారం ఎస్ఐ జి.శ్రీనివాస్‌రెడ్డిని మీర్‌పేటకు బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డీసీబీ ఆఫీస్‌కు అటాచ్ అయిన కె.రాఘవేంద్రగౌడ్ బొమ్మలరామారం ఎస్ఐగా నియమించారు. బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఎన్‌హెచ్-565తో మూడు వేల మందికి అన్యాయం

- ఫీల్డ్ ఎంక్వైరీ లేకుండానే మూడో అలైన్‌మెంట్ అమలుకు చర్యలు
- న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్లకు విన్నవించిన బాధితులు

బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 19 : జాతీయ రహదారి-565 విస్తరణలో భాగంగా ఫీల్డ్ ఎంక్వైరీ లేకుండా పేపర్ ద్వారా రూపొందించిన మూడో అలైన్‌మెంట్‌తో మూడు వేల మందికి అన్యాయం జరుగుతుందని నేషనల్ హైవేలో ప్లాట్లు, ఇండ్లు కోల్పోతున్న బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆదుకోవాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిని బుధవారం ఆశ్రయించారు. నల్లగొండ వీటీ కాలనీలోని తన కార్యాలయంలో బాధితులతో కూర్చొని వారి ఆవేదన విన్నారు. ఈ సందర్భంగా బాధితులు మూడో అలైన్‌మెంట్ కాపీనీ కంచర్లకు చూపించి దీన్ని ఆపాలని కోరారు. మొదటి, రెండో అలైన్‌మెంట్లను పక్కకు పెట్టి కొందరి ప్రయోజనాల కోసం మూడో అలైన్‌మెంట్ సృష్టించి అమలు చేస్తున్నారని తెలిపారు. మూడో అలైన్‌మెంట్ అమలైతే మూడు వేల మందికి సంబంధించిన ప్లాట్లు, ఇండ్లు కోల్పోతారని తెలిపారు. ఒక్కొక్కరి ఆవేదన విన్న కంచర్ల గతంలో రూపొందించిన మొదటి లేదా రెండో అలైన్‌మెంట్ మాత్రమే అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని, నల్లగొండ వేదికగా జరిగే ఉద్యమంలో బాధితులు పాత్రధారులు కావాలని పిలుపునివ్వగా అందరూ అంగీకరించారు.

కోమటిరెడ్డి అనుచరుల కోసమే మార్పు..

ఎన్‌హెచ్-565 విస్తరణలో ఎవరూ నష్టపోవద్దనే ఉద్దేశంతో గతంలో రెండు అలైన్‌మెంట్లు సిద్ధం చేస్తే దాన్ని పక్కకు పెట్టిన మంత్రి కోమటిరెడ్డి వారి అనుచరుల భూముల విలువ పెంచడానికి మూడో అలైన్‌మెంట్ తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. పానగల్ బ్రిడ్జి నుంచి దుప్పలపల్లి, అన్నారం ద్వారా ఎస్ఎల్‌బీసీ వరకు అలైన్‌మెంట్ చేయడం వల్ల అక్కడ ఉన్న రైతుల భూమి కొంచెం పోతే వారి భూములకు విలువ పెరుగుతుందని ఆలోచనతో నాడు ఆ అలైన్‌మెంట్ చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కోమటిరెడ్డి మూడో అలైన్ మెంట్ చేయిస్తున్నారని, దాన్ని అడ్డుకుంటామని చెప్పారు. త్వరలో నిర్వహించబోయే పోరాటానికి బాధితులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, బీఆర్ఎస్ కనగల్ మండలాధ్యక్షుడు ఐతగోని యాదయ్య, నాయకులు దోనాల నాగార్జున రెడ్డి, కందిమల్ల వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

కొనసాగుతున్న అయ్యప్ప ఆలయ బ్రహ్మోత్సవాలు

చౌటుప్పల్, జూన్ 19 : పట్టణకేంద్రంలోని సత్యదేవ సహిత అయ్యప్పస్వామి ఆలయ 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సింహ ద్వారం శంకుస్థాపన, రమాసహిత సత్యనారాయణ స్వామి కల్యాణం, అన్నదానం, అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చేనేత పథకాలను అమలు చేయాలని వినతి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మికులు

మోత్కూరు, జూన్ 19: రాష్ట్ర ప్రభుత్వం చేనేత పథకాలను అమలు చేసి కార్మికులను ఆదుకోవాలని కోరుతూ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. బుధవారం తాసీల్దార్ రాంప్రసాద్‌కు సంఘం ఆధ్వర్యంలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేతన్నలకు ఎంతో కొంత అసరాగా ఉన్న చేయూత, చేనేత మిత్ర, చేనేత బీమా పథకాలను కొనసాగించాలన్నారు. డిసెంబర్ నుంచి ఈ పథకాల అమలు నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పనులు లేక నేత కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జెల్లా నాందేవ్, చింతకింది సోమరాజు, నాగరాజు, సుదర్శన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ఆత్మకూరు(ఎం),జూన్19 : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గురువారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ తండా మంగమ్మాశ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నట్లు పేర్కొన్నారు.

గుండాల పోలీస్ స్టేషన్ తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న సీఐ కొండల్‌రావు

గుండాల, జూన్ 19: గుండాల పోలీస్ స్టేషన్‌ను యాదగిరిగుట్ట సీఐ ఎం.కొండల్‌రావు బుధవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ క్రైం పట్ల అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ యాకన్న ఉన్నారు.